భోగభాగ్యాల భోగి

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మూడు రోజుల ముచ్చటైన పండగ సంక్రాంతిని.. సోమవారం భోగి మంటలతో మంగళగిరి నియోజకవర్గ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున లేని భోగి మంటలు వేసి, మంగళ స్నానాలు గావించారు. ఆలయాల్లో దైవ దర్శనం చేసుకున్నారు. మరోవైపు మహిళలు వాకిళ్లలో అందమైన రంగ వల్లులు తీర్చిదిద్దారు. సాయంత్రం చిన్నారులకు భోగిపళ్లు పోసి బొమ్మల కొలువు నిర్వహించారు. తమ కుటుంబం భోగభాగ్యాలతో తులతూగాలని తామంతా ఆయురారోగ్యాలతో గడపాలని కోరుకుంటూ ప్రజలు భోగి పండగను నిర్వహించుకున్నారు. భోగిమంటల చుట్టూ తిరుగుతూ యువకులు, మహిళలు నృత్యాలు వేశారు. మంగళగిరిలో వాడవాడలా భోగి మంటలతో సందడి వాతావరణం నెలకొంది. మంగళగిరి పట్టణ పరిధిలోని సీతారాముల కోవెల సెంటర్, వీవర్స్ కాలనీ, పాత మంగళగిరి, టిడ్కో గృహ సముదాయాలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ప్రజలు భోగి మంటలు వేశారు. **తాడికొండ:** భోగి పండగ పురస్కరించుకుని గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువ జామునే ప్రధాన వీధుల్లో భోగి మంటలు వేశారు. బంధువుల రాకతో పల్లెలు కళకళలాడాయి.

మహంకాళి దేవస్థానం వద్ద సంక్రాంతి వేడుకలు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం వద్ద సోమవారం భోగి మంటలు వేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు, ట్రస్టు బోర్డు మెంబర్లు, భక్తులు పాల్గొన్నారు.

భోగాలు నొసగే భోగి మంటలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలో భోగి పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు. కట్టెలు, పిడకలతో భోగి మంటలు వేసి నృత్యాలు చేశారు. ఫిరంగిపురంలోని రామాలయం, ప్రధాన రహదారిలోని ఎన్టీఆర్ బొమ్మ సమీపం, మెట్లబజారులోని మూడు బొమ్మల సెంటర్, తూర్పు బజారు, రసూలు పేట, సొలసబస్టాండు సెంటర్లలో పెద్ద కట్టెలు, పిడకలు వేసి భోగి మంటలు వేశారు.


మంగళగిరి సీతారామకోవెల సెంటర్ వద్ద భోగి మంటల వేసిన యువకులు


వీవర్స్ కాలనీలో భోగిమంటల ముందు నృత్యం చేస్తున్న మహిళలు


టిడ్కో గృహ సముదాయం వద్ద భోగిమంటలు వేస్తున్న నివాసితులు


చిన్నారికి భోగిపళ్లు పోస్తున్న కుటుంబ సభ్యులు


భోగి మంటలు వేస్తున్న చిన్నారులు, మహిళలు


శ్రీమహంకాళి అమ్మవారి దేవస్థానం వద్ద భోగి మంట

క్లుప్తంగా

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

తాడికొండ: నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి పండగ శుభాకాంక్షలను వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు సోమవారం తెలిపారు. ప్రతి ఇంట్లో సంక్రాంతి పండుగ కాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. భోగభాగ్యాలు, సిరిసంపదలతో తలతూగాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

ధర్నాను జయప్రదం చేయండి



తాడేపల్లిరూరల్: రైతాంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఈ నెల 17న విజయవాడ ధర్నా చౌక్‌లో రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లి అమరారెడ్డి భవన్‌లో సంఘం మండలాధ్యక్షుడు ఎ.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన రైతు సంఘం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, నాయకులు డి.వెంకటరెడ్డి, పల్లె కృష్ణ, బి.కోటిరెడ్డి పాల్గొన్నారు.

వేమన కళాపరిషత్ సంక్రాంతి వేడుకలు

రావెల (తాడికొండ): మండలంలోని రావెల గ్రామంలో వేమన కళా పరిషత్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నీలం సంజీవరెడ్డి కళా వేదిక రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన వేడుకల్లో ఉదయం భోగి మంటలు వేశారు. చిన్నారులకు లెమన్, సైక్లింగ్, జూనియర్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం మహిళలకు ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సాయంత్రం స్థానిక విజేత ఇంగ్లీషు మీడియం, జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహించి సాంఘికలు అలరించాయి. పరిషత్ అధ్యక్షుడు శ్యామల జయ కోటిరెడ్డి, ఉపాధ్యక్షుడు భీమవరపు ధర్మారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం



మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి రూరల్ పరిధిలోని పెదవడ్లపూడిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవస్థానంలో ధనుర్మాసం ముగింపు సందర్భంగా సోమవారం గోదాదేవి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అన్నే శివశంకర ప్రసాద్, లతారాణి దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ కుర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, కల్యాణ మహోత్సవాన్ని తిలకించారని తెలిపారు. భక్తులకు అన్నదానం నిర్వహించామన్నారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు పాదర్తి వంశీకృష్ణ, లింగినేని సుబ్బారావు, అన్నే శివపార్వతి, టీడీపీ నాయకులు ఉన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఫిరంగిపురం: సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ రవీంద్రబాబు సోమవారం హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ సాంప్రదాయంగా సంక్రాంతి వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.

అగస్త్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



పట్నంబజారు: పాతగుంటూరులోని శ్రీగంగా పార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శివముక్కోటి పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మహన్యాసపూర్వక ఏకదశ రుద్రాభిషేకం, ఉత్తరద్వార దర్శనం నిర్వహించారు. పౌర్ణమి, ఆరుద్ర నక్షత్రం కలిసి భోగి పండుగ రోజున వచ్చిన క్రమంలో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామికి విశేష పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు ఫణిలాల్ శర్మ, సంగమేశ్వరశర్మ, లక్ష్మీనారాయణ, ఏక సాయి శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి సౌమ్య భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేసి, కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు.

భోగిమంటల్లో విద్యుత్ బిల్లుల దహనం


కుంచనపల్లిలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం


యర్రబాలెంలో విద్యుత్ బిల్లులు దహనం

తాడేపల్లిరూరల్: సీపీఎం ఆధ్వర్యంలో కుంచనపల్లిలో భోగిమంటలు వేసి, పెరిగిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ విద్యుత్ బిల్లులు దహనం చేశారు. సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యుత్ బిల్లులు పెంచమని చెప్పి, వచ్చిన తర్వాత విద్యుత్ బిల్లులను విపరీతంగా పెంచిందని మండిపడ్డారు. అదనపు చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజల నెత్తిన విద్యుత్ భారాలు వేయడం సరికాదన్నారు. కాజా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీపీఎం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనగా భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం చేసినట్లు తెలిపారు. కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు, ఎనుముల పార్థు, నాని, గొట్టిపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

- సీపీఎం యర్రబాలెం శాఖ కార్యదర్శి అత్తలూరి వీర వెంకయ్య ఆధ్వర్యంలో భోగి మంటలలో విద్యుత్ బిల్లులను తగలబెట్టారు నాయకులు రామరాజు, రాధిక పాల్గొన్నారు.
- ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. కరెంటు బిల్లులు భోగి మంటల్లో వేసి దహనం చేశారు. నాయకులు ఈశ్వరరెడ్డి, రామకృష్ణ, కోటేశ్వరరావు, వీరారెడ్డి, రాఘవయ్య పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

తాడికొండ: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సోమవారం భోగి మంటల్లో రైతు సంఘ నాయకులు విద్యుత్ బిల్లులు దహనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై పెను భారం మోపిందన్నారు. తక్షణమే పెంచిన చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతు సంఘ నాయకులు చింతల భాస్కరరావు, శ్రీరాములు, చంటి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రభాకర్

విద్యుత్ చార్జీల పెంపుపై పునరాలోచన చేయాలి

మంగళగిరి (తాడేపల్లిరూరల్): కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపుపై పునరాలోచన చేయాలని సీపీఐ మంగళగిరి పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ కోరారు. సోమవారం వేములపల్లి శ్రీకృష్ణ భవన్ సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ప్రభుత్వం ఏడు నెలల్లో కరెంటు భారాలు మోపడం సరికాదన్నారు. పెంచిన విద్యుత్ అదనపు భారం నుంచి ప్రజలను విముక్తులను చేయాలని కోరారు. లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి

మేడికొండూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా భోగి రోజున మంటల్లో పెంచిన విద్యుత్ బిల్లులను వేసి సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ బొట్ల రామకృష్ణ మాట్లాడుతూ 2000లో చంద్రబాబు పరిపాలనలో విద్యుత్ చార్జీలు పెంచడంతో..50 వేల మంది హైదరాబాదులో పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. అప్పుడు కాల్పులు ముగ్గురు కార్యకర్తలను బలితీసుకున్న విషయాన్ని గుర్తుచేసుకున్నారు. మరలా ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు అని రూ.17 వేల కోట్లు ప్రజలపై భారం మోపారని తెలిపారు.

కోర్టు ధిక్కార కేసు నమోదు చేయాలి


మాట్లాడుతున్న ఏపీ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ నాగరాజు, ఈపూరి ఆదాం

మంగళగిరి (తాడేపల్లిరూరల్): ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా వర్గీకరణ అంశంపై రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌పై కోర్టు ధిక్కార కేసు నమోదు చేయాలని ఏపీ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఈపూరి ఆదాం కోరారు. సోమవారం మంగళగిరి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా దాఖలైన రివ్యూ పిటీషన్లు అన్నింటినీ సుప్రీం కోర్టు కొట్టివేస్తే.. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ మాత్రం వర్గీకరణకు వ్యతిరేకంగా ఫిర్యాదులు స్వీకరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూల తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ నిర్వహించిందన్నారు. సదరు కమిషన్ అన్ని జిల్లాల్లో పర్యటన తుదిదశలో ఉందని ఈ నేపథ్యంలో ఒక కమిషన్ సుప్రీంకోర్టు తీర్పుకు లోబడి విధులు నిర్వహించవలసిన ఆవశ్యకత ఉందన్నారు. ఫిర్యాదులపై కమిషన్ విచారణ చేస్తుందా? అసలు కమిషన్‌కు అధికారం ఉందా అని వారు ప్రశ్నించారు. సుప్రీంకోర్టుకు విరుద్ధంగా ఇప్పటి వరకు కమిషన్ స్వీకరించిన ఫిర్యాదులను తిరస్కరించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతిచెందిన రాకేష్


ప్రమాదానికి గురైన కారు

మంగళగిరి (తాడేపల్లి రూరల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మంగళగిరిలో చోటుచేసుకుంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళగిరి పట్టణం టిప్పర్ల బజార్‌కు చెందిన పొన్నగంటి రాకేష్(26) ఉద్యోగ నిమిత్తం హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గత రెండు రోజుల క్రితం మంగళగిరిలోని తన ఇంటికి చేరుకున్నాడు. ఆదివారం రాత్రి స్నేహితులను కలవడం కోసం మంగళగిరి నుంచి కాజకు తన కారులో బయలుదేరాడు. మార్గమధ్యం ఎస్ఆర్ఐ వై జంక్షన్ వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో రాకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఎయిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపారు.

కాకాని శివాలయంలో ఆరుద్రోత్సవం


పెదకాకాని శివాలయం వద్ద స్వామివార్ల గ్రామోత్సవం

పెదకాకాని: పెదకాకాని మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఆరుద్రోత్సవం సందర్భంగా సోమవారం భక్తులు ఉత్తర ద్వారదర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. మల్లేశ్వరస్వామి వారికి మహాన్యాసపూర్వక మహా రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించినారు. ఆరుద్రోత్సవం, భోగి పండుగ సందర్భంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల గ్రామోత్సవం ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంపై కొమ్ము దాసులు, చిన్నారులచే కోలాట భజన, మేళతాళాలతో, బాణసంచా కాల్చుతూ అత్యంత వైభవోపేతంగా పెదకాకాని పుర వీధులలో నిర్వహించారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ దంపతులు, కుటుంబ సభ్యులు సోమవారము ఉదయం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్ ఎమ్మెల్యేను సత్కరించారు. భోగి పండుగ సందర్భంగా గోపూజ జరిగింది. చిన్నారులకు భోగి పళ్లు పోశారు.


ఆరుద్రోత్సవం సందర్భంగా స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు, చిన్నారులు

'బరి'తెగించారు



తాడికొండ: మండలంలో కోడి పందేలు, పేకాట జోరుగా సాగింది. తెలుగుదేశం పార్టీ నాయకులు మోతడక, నిడుముక్కల గ్రామాల్లో బరులు ఏర్పాటు చేసి కోడి పందేలు నిర్వహించారు. కోత ముక్క, నంబర్ లాట ఆడించారు. సాంప్రదాయం పేరుతో ప్రారంభించిన ఈ పందాలు శృతిమించి బెట్టింగులు భారీగా జరిగాయి. రూ.లక్షలు చేతులు మారుతున్న పోలీసులు చోద్యం చూస్తూ ఉండిపోయారు. ఉదయాన్నే ఓ పర్యాయం తొంగి చూసి వెళ్లిపోయిన పోలీసులు ఇక ప్రాంతంలో కనిపించిన దాఖలాలు లేవు.

నేడు చేబ్రోలులో కర్పూర జ్యోతి దర్శనం

చేబ్రోలు: చేబ్రోలులోని చారిత్రక ప్రసిద్ధి చెందిన నాగేశ్వరస్వామి దేవస్థానం వద్ద అయ్యప్పస్వామి వారి మకర విళక్కు సందర్భంగా మంగళవారం రాత్రి కర్పూర జ్యోతి దర్శనం కోసం అయ్యప్ప స్వామి భక్త బృందం ఏర్పాట్లు చేశారు. స్థానిక గాలి గోపురం వద్ద గంగా పార్వతి సమేత నాగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం వద్ద కర్పూర దర్శన కార్యక్రమం జరుగుతుందని గురుస్వామి ఉదయగిరి శ్రీనివాసరావు స్వామి సోమవారం తెలిపారు. ఆలయంలోని అయ్యప్పస్వామి విగ్రహానికి పూజలు చేసిన అనంతరం భక్తులకు కర్పూర జ్యోతి దర్శనం కల్పిస్తున్నట్లు గురుస్వామి తెలిపారు.

ఎంచుకునే లక్ష్యం గొప్పగా ఉండాలి

తెనాలిరూరల్: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎంచుకునే లక్ష్యాలు గొప్పగా ఉండాలని, దానికి తగిన కృషి కూడా అవసరమని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అన్నారు. మండల గ్రామం కొలకలూరు బాబు జగ్జీవన్ రామ్ రీడింగ్ రూమ్ కరుణానిలయం విద్యాసంస్థల వ్యవస్థాపకులు పొన్నెకంటి బెంజమిన్ ప్రాంగణంలో ఐటీసీఎల్ డీలర్ యడ్లపల్లి రవికిరణ్ సారథ్యంలో విద్యార్థులకు కెరీర్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆది జాంబవ దళిత్ ఎంప్లాయిస్ సేవా సమితి(డెస్క్) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ పీజే రత్నాకర్ అధ్యక్షత వహించారు ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా గురువులు, తల్లిదండ్రులను గౌరవించడం తోపాటు సంస్కృతి సంప్రదాయాలను విస్మరించరాదన్నారు.

రై..రై.. రివర్స్..!

సంక్రాంతి సంబరాల్లో ట్రాక్టర్ రివర్స్ పోటీలు


ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కాకుమాను: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండల కేంద్రం కాకుమానులో సోమవారం ట్రాక్టర్ రివర్స్ పోటీలు, మహిళలకు మోకు లాగే పోటీలు నిర్వహించారు. గ్రామ ప్రధాన కూడలిలో నిర్వహించిన పోటీలలో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. పోటీలలో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

ఎమ్మెల్సీగా లక్ష్మణరావును గెలిపించుకుందాం

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు


సమావేశంలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

తాడేపల్లిరూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, వ్యవసాయ కార్మిక, పేదల సమస్యలను శాసన మండలిలో పరిష్కారానికి కృషి చేస్తున్న కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు కోరారు. సోమవారం దుగ్గిరాల మండల పరిధిలోని మంచికలపూడి గ్రామంలో ఏపీ లాయర్స్ యూనియన్ నాయకుడు వై.స్టాలిన్ అధ్యక్షతన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈమని అప్పారావు మాట్లాడుతూ కేఎస్ లక్ష్మణరావు కాంట్రాక్టు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగ సమస్యలపై శాసన మండలిలో ప్రశ్నించడమే కాకుండా రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ప్రశ్నించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో పసుపు దగ్ధమైనప్పుడు రైతులకు అండగా నిలిచారన్నారు. పీడీఎఫ్ తరుపున పోటీ చేస్తున్న కేఎల్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి, గెలిపించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, రైతు సంఘం కార్యదర్శి వై.బ్రహ్మేశ్వరరావు, డీవైఎఫ్ఐ నాయకులు మహేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు వై.తనూజ, వై.చేగువేరా, వై.వినోదు, గోపీ, మని, సంధ్య పాల్గొన్నారు.

కంపెనీ సెక్రటరీ కోర్సులకు ఉజ్వల భవిష్యత్తు

నెహ్రూనగర్: ఆధునిక సమాజంలో కంపెనీ సెక్రటరీ కోర్సులు చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఐసీఎస్ఐ(ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా) ఏపీ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ ఎం వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం బ్రాడీపేటలో ఐసీఎస్ఐ అమరావతి చాప్టర్ 10వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు చదువులు త్వరితగతిన పూర్తి చేసుకుని జీవితంలో స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో ఐసీఎస్ఐ అమరావతి చాప్టర్ చైర్మన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ లాక్కుని పరారైన దుండగులు

పట్నంబజారు: యువకుడి వద్ద నుంచి సెల్‌ఫోన్ లాక్కుని పరారైన ఘటన ఆర్టీసీ బస్టాండ్ వద్ద చోటు చేసుకుంది. వివరాలు.. గుంటూరు నగరంలోని జిన్నాటవర్ సెంటర్‌లో నివాసం ఉండే చెన్నుపాటి రిషేంద్ర అనే యువకుడు సోమవారం హైదరాబాద్ నుంచి గుంటూరు వచ్చాడు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సు దిగి వెళుతున్న క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు యువకులు అతని వద్ద ఫోన్ లాక్కుని పరారయ్యారు. ఈమేరకు బాధితుడు పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది.

రేణు అక్షయకు 'మానవత' సత్కారం



తెనాలి: ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ మానవత బాధ్యులు సోమవారం ప్రఖ్యాత మల్టీనేషనల్ కంపెనీ అమెజాన్‌లో రూ.40 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం పొందిన బి.రేణు అక్షయను సత్కరించారు. మానవత సభ్యుడు, ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ కామర్స్ విభాగాధిపతి డాక్టర్ బి.రాజీవ్ కుమార్తె రేణుఅక్షయ్య ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో అమెజాన్ కంపెనీలో ఇంటర్న్‌షిప్ దరఖాస్తు చేశారు. కొనసాగింపుగా 2024లో ఇంజినీరింగ్ పూర్తి అయిన తరువాత కంపెనీ జరిపిన నాలుగు దశల ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనపరచి రేణు అక్షయ ఈ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఆమె విజయం తెనాలికి గర్వకారణమని మానవత తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రాంచంద్ అన్నారు. సంస్థ బాధ్యులతో కలిసి ఆమె తల్లిదండ్రులు పద్మావతి, రాజీవ్‌ను అభినందించారు. అధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్, వైస్ చైర్మన్ పి.వాసు, సెక్రటరీ పి.వెంకట్, సభ్యులు ఎ.శ్రీనివాసరెడ్డి, శివరామకృష్ణ పాల్గొన్నారు.